సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 20 : మే : 2024



నిధులు నిల్..!

ఏడాదిన్నర నుంచి సకాలంలో ఆరోగ్యశ్రీ నిధులు రాకపోవడంతో ఇల్లెందు ఆస్పత్రి నిర్వహణ భారంగా మారింది. 8లో



మంచానికే పరిమితం..

రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన డ్రైవర్ శస్త్రచికిత్స నిమిత్తం ఆపన్న హస్తం అందించాలని కోరుతున్నాడు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 27°

వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సుజాతనగర్: మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. సీపీఎం సుజాతనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో చింతలపూడి సత్యం భవన్‌లో ఆదివారం చప్పిడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సుందరయ్య తన ఆస్తిని పేదలకు పంచి, ఆనాడు దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షను నిర్మూలించాడని పేర్కొన్నారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై గళమెత్తారని కొనియాడా రు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, పార్టీ ఖమ్మం జిల్లా కమి టీ సభ్యుడు బండి రమేష్, మండల కార్యదర్శి వీర్ల రమేష్, నాయకులు కాట్రాల తిరుపతి రావు, గండమాల భాస్కర్, శివరామకృష్ణ, మద్దెబోయిన గోవర్ధన్, కొండే కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, వీర్ల సత్యం, బాలు వెంకటేశ్వర్లు, మద్దెల శ్రీలక్ష్మి, నాగచందర్, భూక్య శంకర్, బానోత్ వీరు, చల్లా ఏడుకొండలు పాల్గొన్నారు.

కిన్నెరసానిని సందర్శించిన అదనపు కలెక్టర్



బోట్ షికారు చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు

పాల్వంచ: మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌ను ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డీర్ పార్క్, ప్రాజెక్ట్ సందర్శించారు. అనంతరం జలాశయంలో బోట్‌షికారు చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ హచ్యా, సిబ్బంది ఉన్నారు.

రాజశేఖర్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ప్రశంసలు



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

చుంచుపల్లి: కొత్తగూడేనికి చెందిన పర్యావరణ ప్రేమికుడు కొట్టూరు నుర్వి రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్)కు ఆదివారం అంతర్జాతీయ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ నిర్వాహకులు హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు జూలై 2020 నుంచి దాదాపు 1,399 రోజులుగా ప్రతి రోజూ ఒక మొక్కను నాటినందుకు, ప్లాస్టిక్ బొకేలు బదులుగా పచ్చని మొక్కలే ముద్దు అనే నినాదానికి శ్రీకారం చుట్టినందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ ఆయనను ప్రశంసించింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు డాక్టర్ ఎన్.గోపాల్ కృష్ణ, సీనియర్ సినీ డైరెక్టర్, పద్మశ్రీ డాక్టర్ వేలు ఆనందా చారి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చింతపట్ల వెంకటాచారి, జ్యూరీ సభ్యులు టీ.వీ.అశోక్ కుమార్, అక్షర ప్రభాకర్, వనపర్తి పద్మ పాల్గొన్నారు.

'మా ఊర్లో మా రాజ్యం' ఉద్యమం



మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

మణుగూరు టౌన్: మా ఊర్లో మా రాజ్యం స్థాపన కోసం ప్రత్యేక ఉద్యమం చేపడతామని జాతీయ ఆదివాసీ అఖిలపక్షాల మానుకోట పార్లమెంట్ అభ్యర్థి చందా లింగయ్య దొర పేర్కొన్నారు. ఆదివారం తొగ్గూడెం సమ్మక్క–సారలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు ఆదివాసీలను విస్మరించి ఒకే సామాజిక వర్గం లంబాడా తెగకు టికెట్ ఇచ్చాయని ఆరోపించారు. నాయకులు వట్టం ఉపేంద్ర, అలెం కోటి, ముక్తి రాజు, కొడెం వెంకటేశ్వర్లు, పాయం సత్యనారాయణ, పొడుగు శ్రీనాథ్ రమణాల లక్ష్మయ్య, వట్టం నారాయణ, పొడెం రత్నం, వాసం కృష్ణయ్య, పొదెం కృష్ణ ప్రసాద్, వజ్జా నర్సింహారావు, వర్స శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

ధాన్యం 'ప్రైవేటు'కే..

మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లిస్తున్న వ్యాపారులు

- కొనుగోలు కేంద్రాల పట్ల ఆసక్తి చూపని రైతులు
- ధాన్యం సేకరణ లక్ష్యం 65 వేల మెట్రిక్ టన్నులు
- ఇప్పటివరకు 10,645 మెట్రిక్ టన్నులే కొనుగోలు



కరకగూడెం జీసీసీ కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అన్నదాతల నుంచి స్పందన నామమాత్రంగా ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 136 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. యాసంగి సీజన్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ధాన్యం దిగుబడులు కూడా ఆలస్యం అవుతున్నాయి. ఇంకా కొన్ని చోట్ల వరి కోతలు సాగుతున్నాయి. ఎండాకాలం సీజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 36,867 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేయగా, అంచనా కంటే ఎక్కువగా 59,753 ఎకరాల్లో పంట సాగు చేశారు.

దిగుబడి అంచనా 1,11,369 మెట్రిక్ టన్నులు

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1,11,369 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కేంద్రాల ద్వారా 65 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యం నిర్దేశించారు. కానీ అన్నదాతలు మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాల పట్ల ఆసక్తి చూపడంలేదు. ఇప్పటివరకు కేవలం 10,635 మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చాయి. ప్రభుత్వం ఎ–గ్రేడ్ ధాన్యానికి రూ 2,203, బి–గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తోంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలంటే నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. రవాణా చార్జీలు భరించాలి. కొనుగోళ్లు జరిగాక రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యేందుకు సమయం పడుతుంది. దీంతో రైతులు అధికారులు ఆశించిన స్థాయిలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లడంలేదు. కేంద్రాలకు తీసుకెళ్లాక తేమ శాతం ఎక్కువగా ఉంటే మళ్లీ ధాన్యం ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకంటే ఎక్కువగా ఇవ్వడం, కల్లాలు, పొలాల వద్దకు నేరుగా తమ వాహనాలను పంపించి కొనుగోలు చేయడంతోపాటు నగదు కూడా జాప్యం లేకుండా చెల్లించడంతో రైతులు ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే అదే అదునుగా కొందరు వ్యాపారులు తాజాగా సిండికేట్‌గా మారి ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆరబెట్టేందుకు ఇబ్బందులు..



నాణ్యతా ప్రమాణాల పేరుతో ఇబ్బందులు పడుతున్నాం. పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే తేమశాతం ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు తంటాలు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలి.

–బైరిశెట్టి చిరంజీవి, రైతు, కరకగూడెం

ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి



జిల్లాలో 136 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. అవసరాన్ని బట్టి పెంచుతాం. ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. ప్రభుత్వం విధించిన నిబంధనలను, నాణ్యతా ప్రమాణాలను రైతులు పాటించాలి.

–త్రినాథ్‌బాబు, సివిల్ సప్లయీస్ డీఎం

యూనిఫాం క్లాత్ వచ్చేసింది..

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల చొప్పున పంపిణీ
- ఈసారి కుట్టుపని బాధ్యతలు డ్వాక్రా సంఘాలకు అప్పగింత
- జిల్లాలో 63,399 మందికి లబ్ధి
- పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు



విద్యార్థులకు అందించే యూనిఫాం మోడల్

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నూతన యూనిఫాం క్లాత్ జిల్లాకు చేరుకుంది. అధికారులు క్లాత్‌ను పరిశీలించి పాతకొత్తగూడెంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో భద్రపరిచారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు పంపించనున్నారు. ఈ ఏడాది యూనిఫాం కుట్టే బాధ్యతలను స్వయం సహాయక సంఘం సభ్యులకు అప్పగించనున్నారు. జూన్ 12న నుంచి 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభంకానుండగా, అదే రోజు విద్యార్థులకు నూతన యూనిఫాం అందించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

జిల్లాలో 63,399 మంది విద్యార్థులకు..

జిల్లాలోని 1,299 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 63,399 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం పంపిణీ చేయనున్నారు. గతేడాది మాదిరిగానే ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఆకర్షణీయమైన డిజైన్స్‌తో కుట్టించనున్నారు. విద్యార్థినులకు 1 నుంచి 3వ తరగతి వరకు ఒక మోడల్, 4, 5 తరగతులకు మరో మోడల్, 6 నుంచి 12వ తరగతి వరకు మరో మోడల్ కాగా, 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు చొక్కా, నిక్కరు, 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు చొక్కా ప్యాంట్‌ను అందించనున్నారు. గతంలో హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ సభ్యులు కుట్టించేవారు. స్టిచ్చింగ్ పనులు ఆలస్యం అవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ సారి స్వయం సహాయక సంఘాలకు అప్పగించినట్లు అధికారులు చెబుతున్నారు. యూనిఫాం క్లాత్ మండల కేంద్రాలకు చేరుకోగానే డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా ఎంపిక చేసిన 250 స్వయం సహాయక బృందాలకు పాఠశాలల వారీగా క్లాత్‌ను కట్ చేసి ఇవ్వనున్నారు. యూనిఫాం కుట్టించి నిర్ణీత సమయంలో విద్యార్థులకు అందించేలా కలెక్టర్ అన్ని మండలాలకు ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేశారు.

ఈ కమిటీల్లో మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి/మండల నోడల్ అధికారి, డీఆర్‌డీఏ నుంచి డీపీఎం, ఏపీఎంలను, మెప్మా నుంచి డీఎంసీ, టీఎంసీలను సభ్యులుగా నియమించారు. వీరితో పాటు పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యుల భాగస్వామ్యంతోచేస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు కూడా పర్యవేక్షించనున్నాయి. కాగా యూనిఫాం కుట్టించేందుకు జిల్లాలోని 23 మండలాల్లో డీఆర్‌డీఏ, 4 మున్సిపాలిటీల్లో మెప్మా బాధ్యులు ఏర్పాట్లు చేశారు. జూన్ 1 నాటికి ఒక జత యూనిఫాం కుట్టించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

పాఠశాల తెరిచినరోజే అందిస్తాం



రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అందించే యూనిఫాం క్లాత్ జిల్లాకు చేరింది. చేరిన యూనిఫాం క్లాత్‌ను మండలాలకు పంపిణీ చేసి, కుట్టించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది స్వయం సహాయక సంఘాల ద్వారా స్టిచ్చింగ్ పనులు కుట్టిస్తున్నాం. జూన్ 12న విద్యార్థులకు నూతన యూనిఫాం అందిస్తాం.

–ఎం.వెంకటేశ్వరచారి, డీఈఓ

కొత్తగూడెం డిపోకు రెండు లహరి ఏసీ బస్సులు



లహరి ఏసీ స్లీపర్ బస్సు

చుంచుపల్లి: ఆర్టీసీ కొత్తగూడెం డిపోకు రెండు లహరి ఏసీ స్లీపర్ బస్సులను అధికారులు కేటాయించారు. వీటిని ఆదివారం డీఎం బాణాల వెంకటేశ్వరరావు పాల్వంచ నుంచి ప్రారంభించారు. ఏసీ స్లీపర్ బస్సులు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో పాల్వంచ నుంచి మియాపూర్ వెళ్లేందుకు ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. పాల్వంచ నుంచి రాత్రి 10:45 నిమిషాలకు బయలుదేరి మియాపూర్‌కు ఉదయం 6 గంటలకు చేరుకుంటుంది. తిరిగి రాత్రి 10 గంటలకు మియాపూర్‌లో బయలుదేరి ఉదయం 5 గంటలకు కొత్తగూడెం చేరుకుంటుంది. మరో బస్సు పాల్వంచలో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి రాత్రి 7 గంటలకు మియాపూర్‌కు చేరుకుని, తిరిగి రాత్రి 8 గంటలకు బయలుదేరి తెల్లవారు జామున 3 గంటలకు కొత్తగూడెం చేరుకుంటుంది. ఈ రెండు బస్సులు కూడా ఎంజీబీఎస్ మీదుగా నడపనున్నారు. పాల్వంచ నుంచి మియాపూర్‌కు స్లీపర్ బెర్త్ రూ.1,020, సీటింగ్‌కు రూ.790, ఎంజీబీఎస్‌కు స్లీపర్ బెర్త్ రూ. 970, సీటింగ్‌కు రూ. 740, కొత్తగూడెం నుంచి మియాపూర్‌కు స్లీపర్ బెర్త్ రూ. 930, సీటింగ్‌కు రూ. 710 చొప్పున చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. లహరి ఏసీ సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు కోరారు.

జోరుగా తునికాకు సేకరణ

జిల్లాలో 47,800 స్టాండర్డ్ బ్యాగుల సేకరణ లక్ష్యం



కిన్నెరసాని అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న గిరిజనులు



సేకరించిన ఆకును కట్టలు కడుతున్న కూలీలు

పాల్వంచరూరల్: జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో నాలుగైదు రోజులుగా తునికాకు సేకరణ ప్రారంభమైంది. గిరిజన గ్రామాల ప్రజలు ఉదయాన్నే అటవీ ప్రాంతానికి వెళ్లి తునికాకు కోసుకుని వస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో తునికాకు సేకరణ లక్ష్యం 47,800 స్టాండర్డ్ బ్యాగులుగా నిర్దేశించారు. పాల్వంచ డివిజన్ పరిధిలో 4,100 స్టాండర్డ్ బ్యాగులు, కిన్నెరసాని అభయారణ్యం డివిజన్‌లో 5000, కొత్తగూడెం డివిజన్ పరిధిలో 4,800, ఇల్లెందు డివిజన్ పరిధిలో 13,800, భద్రాచలం డివిజన్‌లో 12,600, మణుగూరు డివిజన్‌లో 7500 స్టాండర్డ్ బ్యాగులు సేకరించాల్సి ఉంది. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలో, పాల్వంచ రేంజ్ పరిధిలో జోరుగా తునికాకు సేకరణ జరుగుతోంది. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని ఐదు యూనిట్లలో 5 వేల స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ లక్ష్యం కాగా, పాల్వంచ డివిజన్‌లోని నాలుగు యూనిట్ల పరిధిలో 4,100 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. పాల్వంచ డివిజన్ పరిధిలోని అశ్వారావుపేట యూనిట్ పరిధిలో 300 స్టాండర్డ్ బ్యాగులు, దమ్మపేట యూనిట్‌లో 300 స్టాండర్డ్ బ్యాగులు, ములకలపల్లి యూనిట్‌లో 1,300 స్టాండర్డ్ బ్యాగులు, పాల్వంచ యూనిట్‌లో 400 స్టాండర్డ్ బ్యాగులు సేకరించాల్సి ఉంది. వైల్డ్‌లైఫ్ పరిధిలోని యానంబైల్ డి యూనిట్ 600, యానంబైల్ ఏ యునిట్‌లో 1,500, సీ యూనిట్ పరిధిలో 500, పాల్వంచ ఏ యూనిట్‌లో 200, యానంబైల్ బీ యూనిట్ పరిధిలో 400 స్టాండర్డ్ బ్యాగులు, ఆళ్లపల్లి యూనిట్ పరిధిలో 1,600 స్టాండర్డ్ బ్యాగులు, చాతకొండ యూనిట్‌లో 500, గంగారం యూనిట్‌లో 900 స్టాండర్డ్ బ్యాగులు, రేగళ్ల యూనిట్‌లో 100 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యంగా నిర్దేశించారు. కాగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి వారం నుంచే తునికాకు సేకరణ ప్రారంభమవుతుంది. ఈసారి వారం పది రోజులు ఆలస్యంగా సేకరణ ప్రారంభమైంది. గిరిజనులు వేసవిలో నెలరోజులపాటు తునికాకు సేకరణతో ఉపాధి పొందుతారు. వేకువజామునే అటవీ ప్రాంతానికి వెళ్లి మధ్యాహ్నం వరకు తునికాకు సేకరించుకుని ఇళ్లకు తిరిగి వస్తున్నారు. మధ్యాహ్నం నుంచి 50 ఆకుల చొప్పున కట్టలు కట్టి, సాయంత్రం తీసుకెళ్లి కల్లాల్లో అప్పగిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

భద్రాచలంటౌన్: వర్షాకాలం సమీపిస్తున్నందున ఆదివాసీ గిరిజన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ గిరిజనులకు సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు.

చోరీలపై పట్టింపేది..?

- అక్రమార్కుల పాలవుతున్న జెన్‌కో సొత్తు
- అపహరణకు గురయ్యేది అధికం.. అధికారులు చూపేది స్వల్పం
- రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం
- తరచూ దొంగతనాలతో సంస్థకు భారీ నష్టం



ఎస్‌పీఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్న యాష్‌పాండ్ పైపులు

పాల్వంచ : కేటీపీఎస్ కొందరు అక్రమార్కులకు కల్పతరువుగా మారుతోంది. పటిష్ట భద్రత లేకపోవడంతో నిత్యం రూ.లక్షల విలువైన సొత్తు చోరీకి గురవుతోంది. గత ఫిబ్రవరిలో కేటీపీఎస్ స్టోర్స్ గోదాం గోడకు కన్నం వేసి రూ.లక్షల విలువైన విడిభాగాలు అపహరించగా, ఈ సొత్తు పట్టణంలోని ఓ పాత ఇనుము దుకాణంలో లభ్యమైంది. అయితే ఈ కేసు పై ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కూడా కేటీపీఎస్ యాష్ పాండ్ నుంచి భారీగా ఎంఎస్ ఐరన్ పైపులను గ్యాస్ కట్టర్లతో కట్ చేసి అమ్ముకున్నారు. ఎస్‌పీఎఫ్ అధికారులు స్క్రాప్ షాపులో తని ఖీ చేయగా భారీగా పైపులు పట్టుబడడం గమనార్హం. ఇలా పట్టుబడుతున్న సొత్తే రూ.లక్షల్లో ఉంటే దొరకనది ఇంకే స్థాయిలో ఉందో తెలియడం లేదని పలువురు అంటున్నారు. చోరీ జరిగిన రెండు రోజు లకు కేటీపీఎస్ అధికారులు మేల్కొని కొద్ది మొత్తంలో సొత్తు పోయిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాష్ పాండ్‌లో చోరీలు నిత్యకృత్యంగా మారినా నిఘా పెట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తరచూ చోరీలతో భారీ నష్టం..

కేటీపీఎస్ యాష్ పాండ్, కూల్చివేసిన పాత ప్లాంట్‌లు, స్టోర్స్ గోడౌన్‌లే టార్గెట్‌గా చోరీల పరంపర కొనసాగుతోంది. ఇందులో జరిగిన అనేక చోరీల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. యాష్‌పాండ్‌లో ఉపయోగంలో ఉన్న అత్యంత విలువైన పైపులను గ్యాస్ కట్టర్లతో కట్ చేసి స్థానిక దమ్మపేట సెంటర్‌లోని పాత ఇనుము షాపుల్లో అమ్మినట్టు తేలినా పోలీస్ ఉన్నతాధికారులు సదరు వ్యక్తులపై చర్య తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

చోరీ ఘటనలు ఇలా..

- గత ఆగస్టు 17న అర్ధరాత్రి కేటీపీఎస్ యాష్ పాండ్ నుంచి పైపులను ముక్కలుగా కట్ చేసి లారీలో తరలించేందుకు సిద్ధం చేయగా ఎస్‌పీఎఫ్, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.2.50 లక్షలుగా గుర్తించారు.
- అక్టోబర్‌లో యాష్ పాండ్ నుంచి ఐరన్ పైపులు ట్రాక్టర్ తరలిస్తుండగా పట్టుకున్నారు.
- నవంబర్ 12న ఐరన్ పైపులను ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా ఎస్‌పీఎఫ్ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు.
- డిసెంబర్ 18న యాష్ పాండ్ నుంచి ఇద్దరు వ్యక్తులు రూ.50వేల విలువ చేసే ఐరన్ పైపును కట్ చేసి ఆటోలో తరలిస్తుండగా ఎస్‌పీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. ఆటోతోపాటు పైపులు, గ్యాస్ కట్టర్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 19న దమ్మపేట సెంటర్‌లోని స్క్రాప్ షాపులో జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేశ్ తనిఖీ చేసి రూ.50 వేల విలువైన స్పేర్ పార్ట్‌లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేపట్టగా స్టోర్స్ గోడౌన్‌కు కన్నం వేసి 157 నికెల్ పైపులు, 4 రాడ్లు, బోల్ట్‌లు, నట్లు చోరీ చేసినట్లు గుర్తించారు.
- ఈనెల 16న దమ్మపేట సెంటర్‌లోని సాయిరాం పాత ఇనుప కొట్లో రూ.2.50 లక్షల విలువైన సొత్తు, నాలుగు ఆక్సిజన్ సిలిండర్లు, 2 ఎల్‌పీజీ సిలిండర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా పోయిన సొత్తు తమదేనని, రూ.80 వేల విలువైన పైపులు యాష్‌పాండ్ నుంచి చోరీ అయ్యాయని ఏఈ రామారావు 17వ తేదీన రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నామమాత్రపు ఫిర్యాదులతో సరి..

జెన్‌కో సొత్తు భారీగా హద్దులు దాటిపోతుండగా పట్టుబడిన ఘటనల్లో గత్యంతరం లేక అధికారులు నామమాత్రపు ఫిర్యాదులతో సరిపెడుతున్నారు. ఈ సొత్తు ప్రస్తుతం ఉపయోగంలో ఉన్నదే కావడంతో దాని విలువ భారీగా ఉంటున్నా కొద్ది మొత్తంలో మాత్రమే చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని సమాచారం. రూ.లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైతే దాని విలువ రూ. వేలల్లోనే చూపిస్తున్నారు. స్క్రాప్ షాప్ నిర్వాహకులపై సరైన చర్యలు తీసుకోకపోగా వారికి కొందరు అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అనుమానిత ప్రాంతాల్లో కనీసం సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం.

పెట్రోలింగ్ చేయిస్తున్నాం



యాష్ పాండ్‌పై నిత్యం పెట్రోలింగ్ చేయిస్తున్నాం. పరిధి ఎక్కువ కావడంతో అడపాదడపా చోరీలు జరుగుతున్నాయి. పెట్రోలింగ్ సిబ్బందిపై కూడా దొంగలు దాడికి పాల్పడుతున్నారు. నిఘా లేకపోతే నిత్యం చోరీలు జరిగేవి. చోరీ ఘటనలను పోలీసులు, జెన్‌కో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

– గుర్రం రాజ్‌కుమార్, ఇన్‌చార్జ్ సీఈ

ప్రచార జోరు

- నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి నేతల రాక
- ఒకే రోజు మూడు ప్రధాన పార్టీల సమావేశాలు

ఇల్లెందు: నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. ఇల్లెందులో సోమవారం ఒకే రోజు మూడు పార్టీల సభలు నిర్వహించనున్నారు. బరిలో నిలిచిన ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమందేర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఇల్లెందులో ప్రచారానికి రానున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ సమావేశం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. సమావేశానికి నియోజకవర్గ పరిధిలో 2000 మంది పట్టభద్రులను సమీకరించేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేస్తున్నారు. అభ్యర్థి తీన్మార్ మల్లన్నతోపాటు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మువ్వా విజయ్‌బాబు తదితరులు హాజరుకానున్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సింగరేణి హైస్కూల్‌లో..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో పట్టభద్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు, పట్టభద్రులు తరలివచ్చి కేటీఆర్ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు దిండిగాల రాజేందర్, నాయకులు వరప్రసాద్, శీలం రమేష్, తాత గణేష్, అంతోటి అచ్చయ్య పాల్గొన్నారు.

బీజేపీ సభ..

బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు మధ్యాహ్నం 2 గంటలకు సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ తదితరులు హాజరుకానున్నారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, బూత్ కమిటీ ప్రతినిధులు గ్రామాలలో పర్యటించి పట్టభద్రులను అధిక సంఖ్యలో సమీకరించేలా పార్టీ నాయకులు కృషి చేస్తున్నారు.

క్లుప్తంగా

కర్రసాములో 'గురుదేవ్' విద్యార్థుల సత్తా..



కర్రసాములో ప్రతిభ చాటిన విద్యార్థులు

చర్ల రూరల్: వరల్డ్ యూనియన్ సిలంబం ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈనెల 17, 18, 19 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన ఏషియన్ చాంపియన్‌షిప్ సిలంబం (కర్రసాము) పోటీల్లో చర్ల గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. సింగిల్ స్టిక్ విభాగంలో సీహెచ్.దేవి, భవ్యశ్రీ , ఎం.నిత్యనందిత, ఎస్‌కె.తహీరలు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. అలాగే టి.సాహితి, బి.మాధురిలు కాంస్య పతకాలు సాధించారు. ఈమేరకు గురుదేవ విద్యాలయంలో గత ఏడాది కాలంగా విద్యార్థులకు కర్రసాములో శిక్షణ ఇచ్చిన మామిడి హారిక, పీఈటీ రామకృష్ణ, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌జీవీ గిరి, అకడమిక్ కో ఆర్డినేటర్లు ఎంవీ సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాస్, ఎంఈఓ ఝుంకీలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: చర్లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఆదివారం చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, కుమా జిల్లాల నుంచి పెద్దఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా.. వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియన్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన తాలిపేరు ప్రాజెక్టు రోడ్డు, లెనిన్‌కాలనీ, కలివేరు క్రాస్‌రోడ్డు, కుర్నపల్లి రోడ్డులలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా అనుమానితులుగా భావిస్తూ పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను కొనసాగించారు.

మామపై అల్లుడి హత్యాయత్నం

పాల్వంచ: మామపై ఓ అల్లుడు కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ప్రభాత్‌నగర్‌కు చెందిన సామా రవీందర్‌రెడ్డి తన కూతురు వైష్ణవిని మణుగూరుకు చెందిన రవిచంద్రారెడ్డికి గత ఏడాది కిందట వివాహం జరిపించాడు. వివాహం అయిన నెల రోజుల నుంచి రవిచంద్రారెడ్డి తన భార్యను తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడు. కాగా, ఇటీవల వారికి పాప పుట్టడంతో వైష్ణవి పుట్టింటికి వచ్చింది. ఈనెల 11వ తేదీ రాత్రి సమయాన రవిచంద్రారెడ్డి గోడ దూకి వచ్చి మామ రవీందర్‌రెడ్డిని కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆదివారం వైష్ణవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తన భర్తతో పాటు అత్తమామలు రామిరెడ్డి, సరిత, ఆడబిడ్డ కీర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అరెస్టయిన నేతలను కోర్టుకు తరలించాలి

ఇల్లెందురూరల్: వరంగల్‌లో అరెస్టయిన న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాల నాయకులను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ పట్టణంలో న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాల నాయకులు రాజన్న, దేవిరెడ్డి, జీవన్‌లతో పాటు మరో నలుగురిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. వారికి ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టుకు తరలించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రఘునాథపాలెం: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటనపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం నగర శివారు బాలాపేటతండాకు చెందిన పలువురు యువకులు ఈ నెల 5వ తేదీన డీజేలు తీసుకొచ్చేందుకు ట్రాలీ ఆటోలో రఘునాథపాలెం మండలం రాంక్యాతండా వెళ్తున్నారు. ఈక్రమంలో గ్రామ సమీపంలో ట్రాలీ పల్టీ కొట్టగా ఐదుగురు యువకులు గాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ధరావత్ వికాస్ (18)ను హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆటోడ్రైవర్‌గా పనిచేసే ధరావత్ నాగులు, బుజ్జి దంపతుల పెద్ద కుమారుడైన వికాస్ ఇంటర్ చదివాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,229

నిధులు నిల్..!



ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

భారంగా మారిన ఆస్పత్రి నిర్వహణ

- ఆరోగ్యశ్రీ నిధుల విడుదలలో జాప్యం
- సుమారు రూ.70 లక్షలు ఆగిన వైనం
- కనీస సదుపాయాల కోసం ఎదురుచూపులు
- అప్‌గ్రేడ్ అయినా అందని ద్రాక్షలా వైద్యం
- జిల్లాలోని ఆస్పత్రుల పరిస్థితి ఇదే..



డీజిల్ లేక నిరుపయోగంగా జనరేటర్

ఇల్లెందు: ప్రతీ రోగిని ఆరోగ్యశ్రీ ద్వారా పరీక్షించడం, దాని ద్వారా లభించే నిధులతో ఆస్పత్రి ఆలనా– పాలనా సాగాలి. అయితే గడిచిన ఏడాదిన్నర కాలంగా ఆరోగ్యశ్రీ నిధుల విడుదతో జాప్యం కారణంగా ఆస్పత్రి నిర్వహణ బహుభారంగా మారింది. ఆరోగ్యశ్రీలో అందించిన వైద్యానికి ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులతో ఆస్పత్రి నిర్వహణ చేసుకోవాలని నిబంధన ఉండగా.. ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు ఆరోగ్యశ్రీ కింద సుమారు రూ.70 లక్షలు నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఒక్క ఇల్లెందు ఆస్పత్రికే కాదు జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, బూర్గంపాడు, మణుగూరు, భద్రాచలం , అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రులకు ఇదే పరిస్థితి.

ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినా..

ఇల్లెందు ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినా.. ఆరోగ్యశ్రీ నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది. ఇక్కడి రోగులకు సరైన వైద్యం అందించేందుకు తగిన సదుపాయాలు లేకపోవడంతో ఆస్పత్రి నిర్వహణ నీరుగారుతోంది. ఇల్లెందులోని 30 పడకల ఆస్పత్రికి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకొచ్చి 10 నుంచి 15 మంది వరకు డాక్టర్లను నియమించారు. అనూహ్యంగా మళ్లీ 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కూడా చేశారు కానీ ఇందుకు తగిన సదుపాయాలు కల్పించడం మరిచారు. ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నా.. ఆశించిన వైద్యం అందడం లేదు. ప్రతీ రోజు 500 మంది రోగుల ఓపీ తాకిడి ఉంటుంది.

పెరిగిన కాన్పులు, ఆపరేషన్లు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత ఏడుగురు ప్రత్యేక వైద్యనిపుణులు, నలుగురు జనరల్ డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. కాగా, గతంలో ఎన్నో ఏళ్లుగా స్త్రీ ప్రసూతి ప్రత్యేక వైద్య నిపుణులు లేక గర్భిణులకు సరైన వైద్యం అందక కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సి వచ్చేది. ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయిన తర్వాత స్త్రీ ప్రసూతి వైద్యులు రావడంతో ప్రసవాలు, ఆపరేషన్లు సాగుతున్నాయి.

అందుబాటులో లేని పరికరాలు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఏడుగురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. సరైన వైద్యం అందించాలంటే అందుకు తగిన సదుపాయాలు ముఖ్యంగా పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవి ఇక్కడ ఏర్పాటు చేయలేదు. ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు సీఏఆర్‌ఎం-1, డ్రిల్లింగ్ యంత్రం -1, డెంటల్ చైర్-1, స్లిప్ ల్యాంప్-1, ఏఆర్ మిషన్-1, మైక్రోస్కోప్-1, ల్యాప్రోస్కోపిక్-1 లేవు. అంతేకాక ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నా.. డీజిల్‌కు నిధులు కొరత తీవ్రంగా ఉండడంతో నిరుపయోగంగా మారింది. ఇక అంబులెన్సు కూడా లేదు. కాగా, ఐటీడీఏ నుంచి సమకూరుస్తామని పీఓ ప్రతీక్ జైన్ హామీ ఇచ్చారు.

నిధులు కేటాయించాలి..



ఆస్పత్రిలో రోగులకు సకల సదుపాయాలు అందాలంటే సరిపడా నిధులు ఉండాలి. నిధులు లేక ఆస్పత్రి నిర్వహణ కష్టంగా మారింది. అంతేకాక ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందించిన వైద్యం కింద విడుదల చేయాల్సిన నిధులు కూడా అందలేదు. నిత్యం డయాలసిస్ కోసం వచ్చే రోగులతో పాటు ఇతర రోగులకు సరిపడా నిధులు లేక వైద్యం అందించలేకపోతున్నారు.

– కటకం దయాకర్, డయాలసిస్ బాధితుడు, ఇల్లెందు

నిధులుంటేనే మెరుగైన వైద్యం..



ఆస్పత్రి నిర్వహణ సరిగా ఉండాలంటే నిధులు అందుబాటులో ఉండాలి. గతేడాదిన్నర కాలంగా ఆరోగ్యశ్రీ కింద అందించిన సేవలకు సుమారు రూ.70 లక్షలు నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇటీవల హెల్త్ డైరెక్టర్ అజయ్‌కుమార్ ఆస్పత్రిని సందర్శించినప్పుడు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలని లిఖిత పూర్వకంగా లేఖ అందజేశాం. నిధులు సమకూరితే సదుపాయాలు కల్పించే అవకాశం ఉంది.

–డాక్టర్ జి.హర్షవర్ధన్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, ఇల్లెందు

రెండేళ్లుగా మంచానికే పరిమితం..

- రోడ్డు ప్రమాదంలో నడుముకు గాయం
- తండ్రి కూలికెళ్తేనే ఇల్లు గడిచేది..
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న కుటుంబీకులు

దీనగాథ



మంచానికే పరిమితమైన నాగుల్‌మీరా

చంద్రుగొండ: డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించే ఓ వ్యక్తికి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంతో రెండేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఈనేపథ్యాన భార్య పుట్టింటికి వెళ్లిపోగా వృద్ధాప్యంలో ఉన్న ఆ వ్యక్తి తల్లిదండ్రులే అతడిని సాకుతున్నారు. కూలీ వెళ్తేనే గడవని ఆ కుటుంబం పరిస్థితి శస్త్ర చికిత్స చేయించేందుకు డబ్బులు లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చంద్రుగొండ శివారు ఇందిరానగర్‌కు చెందిన ఎస్‌కె.నాగుల్‌మీరా లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. పాల్వంచకు చెందిన ఓ యువతితో గత నాలుగేళ్ల క్రితం వివాహం కాగా వీరికి మూడేళ్ల వయసున్న ఇద్దరు ఆడ కవల పిల్లలు ఉన్నారు. అంత బాగానే ఉన్న సమయాన విధి వక్రీకరించి గత రెండేళ్ల క్రితం తన ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో నాగుల్‌మీరాకు నడుము విరిగింది. ప్రాథమిక చికిత్స అనంతరం అతడికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో నాగుల్‌మీరాను తన భార్య వదిలేసి పిల్లలతో తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఇమాంబీ, తండ్రి అజ్గర్ ఇద్దరే నాగుల్‌మీరాను సాకుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాగుల్‌మీరాకు వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు..

వైద్య సాయం పొందేందుకు ఆపన్నహస్తం కోసం నాగుల్‌మీరా కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ ప్రభుత్వం తరఫున వైద్యం జరిగేలా కృషి చేస్తానని చెప్పినప్పటికీ కనీసం ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో అతడు ఇంట్లోనే నిస్సహాయస్థితిలో కాలం వెళ్లదీస్తున్నాడు. నాగుల్‌మీరాకు సాయం చేసేవారు ఫోన్ పే లేదా గూగుల్ పే నంబర్ 97038 90408కు ఆర్థిక సాయం అందించాలని ఇందిరానగర్ వాసులు కోరుతున్నారు.

ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణా నిలిపివేత



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న లారీ యజమానుల సంఘం నాయకులు

సత్తుపల్లి: కొత్తగూడెం ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు టిప్పర్ల రవాణాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఒక అంగీకారం కుదిరింది. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి సమక్షంలో సింగరేణి అధికారులు, లారీ యజమానులతో ముఖాముఖి చర్చలు జరిగాయి. ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణాను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదంటూ లారీ యజమానులు స్పష్టం చేయటంతో ఎమ్మెల్యే సూచనలతో ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు సింగరేణి అధికారులు పేర్కొన్నారు. బొగ్గు లారీల లోడింగ్ పెంచే వరకు లోడింగ్‌లకు వెళ్లేది లేదంటూ లారీ యజమానులు చెప్పటంతో పరిశ్రమల నుంచి కొనుగోలు ఆర్డర్ లేనప్పుడు లోడింగ్‌లు ఎలా ఇస్తామని సింగరేణి అధికారులు చెప్పటంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది.

మంత్రి పొంగులేటికి విన్నపం..

రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదివారం లారీ యజమానులు ఖమ్మంలో కలిసి సమస్యలను విన్నవించారు. అధికారులతో చర్చించి చెబుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో లారీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి రమేశ్‌రెడ్డి, ఎస్‌కే కీజర్, పీఎల్ ప్రసాద్, చిన్నంశెట్టి సూరిబాబు, వేముల విశ్వనాథం, నడిపల్లి రాంబాబు, ఎస్‌కే రఫీ, ఎస్‌కే లియాకత్, నజీర్, ఎస్‌కే రెహ్మాన్, ఎస్‌కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలి



సంఘం సభ్యులతో డాక్టర్ బైరి నరేశ్

ఖమ్మంమామిళ్లగూడెం: ఆత్యహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం పూలే, అంబేడ్కర్ అధ్యయన వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ అత్మహత్యలు పెరిగిపోతున్నాయని, అనేక కారణాలతో చాలామంది తనువు చాలిస్తున్నారని చెప్పారు. అత్మహత్యల నివారణపై ఏమాత్రం ఆలోచించకపోవడం బాధాకరమని, మూఢ నమ్మకాలతో పాటు సమాజం ఎదుర్కొనే అనేక సమస్యలపై సంఘం సభ్యులు నిరంతరం ప్రజలని చైతన్య పరచాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రీతి సంఘర్షణ, పొడకంటి రాంబాబు, లింగబోయిన లక్ష్మణ్, దార వెంకన్న, కోయిని వెంకన్న, రాఘవులు, గురుమూర్తి, బిక్కులాల్‌నాయక్, శివాజీ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సోమ్లానాయక్‌కు డిప్యూటీ సీఎం పరామర్శ



సోమ్లానాయక్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మంవన్‌టౌన్: హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు సోమ్లానాయక్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సోమ్లానాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని వైద్యులకు భట్టి సూచించారు.

'చలో బస్ భవన్'ను జయప్రదం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వంలో టీఎస్ ఆర్టీసీని విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేయాలని, 2013 పీఆర్‌సీకి సంబంధించిన బాండ్ డబ్బులు వెంటనే కార్మికులకు చెల్లించాలనే సమస్యలపై ఈ నెల 21న తలపెట్టిన 'చలో బస్‌భవన్'కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావు పిలుపునిచ్చారు. ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఖమ్మం కొత్త బస్టాండ్‌లో డ్రైవర్లకు, కండక్టర్లకు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం ఉద్యోగులను విభజించి పాలించే చర్యలు చేపడుతోందని, వేతనాల చెల్లింపులో దశలవారీ విధానం అవలంబిస్తోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాయంగా సస్పెండ్, రిమూవైన ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించి న్యాయం చేయాలని కోరారు. మహిళా కార్మికులు రాత్రి 8 గంటల లోపు విధుల నుంచి దిగేవిధంగా విధులు కేటాయించాలని, మహాలక్ష్మీ రద్దీని తట్టుకునే విధంగా బస్సులు, కార్మికుల సంఖ్యను పెంచాలనే తదితర డిమాండ్లతో 21న 'చలో బస్‌భవన్'ను చేపట్టామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిల్లి రమేశ్, ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు దేశబోయిన జగన్నాథం, బేతం పూడి బుచ్చిబాబు, డిపో ట్రెజరర్ దామాల లాజర్, నాయకులు వెంపటి గోవర్ధన్, ప్రదీప్‌కుమార్, చెన్నారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం కోసం పోరాడాలి



కవాతు నిర్వహిస్తున్న రెడ్‌షర్ట్ వలంటీర్లు

- కార్మికులు, కర్షకులు ఐక్యం కావాలి
- తెలంగాణ గొప్ప ఉద్యమ భూమి
- కేరళ మాజీ మంత్రి శైలజ



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శైలజ టీచర్, పక్కన తమ్మినేని

ఖమ్మంమయూరిసెంటర్ : దేశంలో ఇంకా ఎంతో మంది నిరక్షరాస్యులు, అంటరానివారు ఉన్నారని, పాలకుల విధానాలతో వారు అనేక బాధలు పడుతున్నారని, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాటాలు చేయాలని కేరళ మాజీ మంత్రి కే.కే. శైలజ టీచర్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్మించిన ఖానాపురంహవేలి కార్యాలయం(సత్తెనపల్లి రామకృష్ణ భవన్)ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. తొలుత సీపీఎం జిల్లా కార్యాలయం నుంచి రెడ్ షర్ట్ వలంటీర్లతో భారీ కవాతు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో శైలజ టీచర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు కార్మికులు, కర్షకులు ఏకం కావాలన్నారు. కమ్యూనిస్టు ప్రభుత్వం ఉన్న కేరళలో విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని, అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళేనని అన్నారు. బూర్జువా పార్టీల పాలనలో పెట్టుబడిదారులు మరింత సంపన్నులుగా ఎదుగుతున్నారని, పేదలు మరింత పేదరికంలోకి వెళుతున్నారని అన్నారు. దోపిడీ, అసమానతలు, ఆకలి సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, కమ్యూనిస్టులు ఉంటారని చెప్పారు. ఈ అసమానతలకు పరిష్కారం కార్మికవర్గ రాజ్యస్థాపనేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం గొప్ప పోరాట భూమి అని, ఇక్కడ పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం లాంటి నాయకుల పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కమ్యూనిస్టు కార్యాలయాలు అంటే ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా నిలుస్తున్నాయని తెలిపారు. కరోనా కాలంలో రాష్ట్రంలో మొదట ప్రజల ముందుకొచ్చి వైద్య కార్యక్రమాలు నిర్వహించింది తమ పార్టీయేనని చెప్పారు. సీపీఎం ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర నాయకులు బి.వెంకట్, ఎం.సాయిబాబు, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, నాయకులు పి. సోమయ్య, ఎర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, సత్తెనపల్లి మంగ, ఎస్.నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శైలజ టీచర్‌కు పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయనగర్‌కు చెందిన ప్రమీల అనే యువతి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి ఆపై ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా యువతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

అన్నపురెడ్డిపల్లి: రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని గూడ్స్ రైలు ఢీకొట్టిన ఘటనలో గాయాలైన సంఘటన మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన వెంకటకృష్ణ(35) ఆదివారం తెల్లవారుజామున రైలు పట్టాలను దాటుతూ బహిర్భూమికి వెళ్తున్నాడు ఈ క్రమంలో అటుగా వస్తున్న గూడ్స్ రైలును గమనించకపోవడంతో వెంకటకృష్ణను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కుడికాలు విరగగా.. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది నాగేంద్రబాబు, రాజా క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం



పిడుగు పడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

చర్ల: ఉరుములు, మెరుపులతో పడిన వర్షం కారణంగా ఓ ఇంటి ఆవరణలోని బొబ్బరి చెట్టుపై పిడుగుపడి నిలువునా దగ్ధమైంది. ఆదివారం సాయంత్రం చర్ల మండలంలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామపంచాయతీలో గల దానవాయిపేటలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో చలపతి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో కొబ్బరి చెట్టు నిలువునా కాలిపోగా.. దీన్ని చూసేందుకు గ్రామస్తులంతా పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు.

రేగళ్లలో కోడి, లేగదూడ మృతి



మృతి చెందిన కోడి, లేగదూడ

కరకగూడెం: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో రేగళ్ల గ్రామానికి చెందిన మాడి చెన్నయ్య అనే రైతుకు సంబంధించిన కోడి, లేగదూడపై పిడుగు పడడంతో మృత్యువాత చెందాయి. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

రఘునాథపాలెం: ఇటీవల విడుదలైన ఎప్‌సెట్ (ఎంసెట్) ఫలితాల్లో ర్యాంక్ తక్కువ రావటంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వి.వెంకటాయపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీహరి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లగాని శ్రీను చిన్న కుమార్తె మేఘన (19) ఇంటర్మీడియట్ చదివింది. హైదరాబాద్‌లో ఎప్‌సెట్ (ఎంసెట్) కోచింగ్ తీసుకున్నప్పటికీ శనివారం విడుదలైన ఫలితాల్లో ఆశించిన స్థాయిలో ర్యాంక్ రాలేదు. దీనికి తోడు అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మనస్తాపానికి గురై ఆదివారం తెల్లవారుఝామున ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.